## ఈనెల 16న జరిగే కమిటి ఏర్పాటుకు కురుబ యువకులు తరలిరావాలి


సమావేశమైన కురుబ సంఘం నాయకులు

**బత్తలపల్లి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** మండలకేంద్రంలో ఈ నెల 16న జరిగే నూతన కమిటీ ఏర్పాటుకు మండలంలోని కురుబ యువకులంతా తరలిరావాలని రాష్ట్ర కురుబ యువత అధ్యక్షులు వశికేరి రమేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సత్యసాయి జిల్లా కురుబ యువజన సంఘం కమిటీల ఎన్నిక కోటిసాయి లిపి డిగ్రి కళశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజులలో యువత ప్రాముఖ్యతను గుర్తించి ఏ రాజకీయ పార్టీలలో కురుబలకు ప్రాధాన్యత ఇస్తుందో ఆ పార్టీతో కురుబలు వుంటారని తెలిపారు. పార్టీలకు అతీతంగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆసక్తి కలిగిన యువత తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కురుబ సంఘం రాష్ట్ర ఎక్జిక్యూటివ్‌మెంబర్ పావురాల జగదీష్, రాష్ట్ర యువత శ్రీకాంత్, బండి వీరనారప్ప, యనుములవారిపల్లి మల్లికార్జున, మిడతల లక్ష్మినారాయణ, కోటి నరేష్, కోటి సురేష్, ఖ్బల సుదర్షన్, పామాల రమేష్, మాలగుండ్ల శ్రీకాంత్, బొంతల ప్రతాప్, కోటి గోపినాధ్ తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతకు సాంస్కృతిక మండలి సన్మానం

### 'జన్మలగ్న సాధన గణితము' ఆవిష్కరణ


అవార్డు గ్రహీతకు సత్కరిస్తున్న సాంస్కృతిక మండలి సభ్యులు

**ధర్మవరం టౌన్, ఏప్రిల్ 12 ప్రభాత వార్త :** సైంటిఫిక్ జ్యోతిష్యం- వాస్తు- న్యూమరాలజీ పరిశోధనలో పలు అవార్డులు, పురస్కారాలు, ప్రశంసాపత్రాలు సాధించిన దాసరి యోగీశ్వర్‌ను స్థానిక సాంస్కృతిక మండలి ఘనంగా సన్మానించింది. ధర్మవరంకు చెందిన యోగీశ్వర్ శాస్రీయ జ్యోతిష్యంకు చెందిన అనేక పుస్తకాలతో పాటు జ్యోతిష్య, వాస్తు శాస్త్రంలోని అపోహల నివారణకు పలు వ్యాసాలు, మూఢనమ్మకాలపై పరిశోధనాత్మక వ్యాసాలనురాశారు. జ్యోతిష్య వాస్తు న్యూమరాలజీలలో యోగీశ్వర్ చేసిన కృషికి పలు సంస్థలు జ్యోతిష్య వాస్తు నిధి, యూత్ ఐకాన్, పొట్టి శ్రీరాములు ఇంటర్‌నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డు, యువతేజం బెస్ట్ సేవా అవార్డు, విశ్వంభర జాతీయ ఉత్తమ సేవా పురస్కారంతో పాటు పలు ప్రశంశా పత్రాలు అందాయి. యోగీశ్వర్ గౌరవార్థం స్థానిక సాంస్కృతిక మండలి బుధవారం ఘనంగా సత్కరించింది. దుశ్శాలువలు కప్పిపూలమాలలు వేసి శాస్త్రీయ జ్యోతిష్యం కోసం ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా యోగీశ్వర్ మాట్లాడుతూ జ్యోతిష్య శాస్త్రము మహాసముద్రం లాంటిదన్నారు. ఎన్ని యుగాలు గడచినా మానవ జీవన ప్రయాణంలో జ్యోతిష్య శాస్త్రంకీలకమైన కొలమానంగా మారిందన్నారు. ఇప్పుడు జ్యోతిష్య శాస్రం అందరికీ అందుబాటులో ఉంటూ అత్యంత ప్రజాదరణ పొందుతోందని తెలిపారు. జ్యోతిష్యం కూడా ఒక సైన్స్ అని నిరూపించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రతివిషయాన్ని కూలంకషంగా పంచాంగంలో తెలుపుతూ జ్యోతిష్య శాస్రం సైన్స్‌కు ధీటుగా నిలబడుతోందన్నారు. భౌతిక శాస్త్ర పితామహుడు న్యూటన్ కూడా జ్యోతిష్య శాస్త్రాన్ని నమ్మేవారని ఆయన తెలిపారు. కొందరు హేతువాదులు జ్యోతిష్య శాస్త్రాన్నివిమర్శిస్తున్నారని, జ్యోతిష్య శాస్త్రాన్ని అధ్యయనం చేసిన తరువాత విమర్శిస్తే బాగుంటుదని ఆయన సూచించారు. గడచిన కాలంలో జన్మించిన వారి జన్మలగ్నం తెలుసుకునేందుకు ఆనాటి పంచాంగం చూడాల్సి వచ్చేదన్నారు. ఎప్పుడు పుట్టిన వారైన ఒకే పుస్తకం ద్వారా వారి జన్మలగ్నంను డిగ్రీలలో వారే స్వయంగా తెలుసుకునేందుకు ఒక పుస్తకాన్ని రాయాలన్న తన ఆలోచన వల్ల ఈ గ్రంథంకు రూపకల్పన జరిగిందన్నారు. ప్రపంచంలో ఏదేశంలో పుట్టిన వారైనా తాను రాసిన 'జన్మలగ్న సాధన గణితము' ద్వారా పంచాంగం చూడకుండానే జన్మలగ్న వివరాలను డిగ్రీలలో తెలుసుకోవచ్చున్నారు. సైంటిఫిక్ పద్ధతిలో నిరూపణకు నిలబడేలా ఈ గ్రంధాన్ని రచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్రసాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ళ వెంకటేసులు, బాలం శ్రీనివాసులు, బాలం ఆదిశేషు, దుస్సా క్రిష్ణ, బండారు ఆదినారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జా దారుల నుంచి హక్కు దారులకు భూమిని అప్పగించాలి

### - కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల డిమాండ్

**పెనుకొండ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ప్రైవేటు భూమిని నకిలీ పత్రాలతో దురాక్రమణకు పాల్పడిన వారి నుంచి హక్కు దారులకు భూమిని అప్పగించాలని కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పెనుకొండ పట్టణానికి చెందిన సయ్యద్ ఎద్దుల్లా, హుస్సేన్ మహమ్మద్‌సై అను ఇరు కుటుంబాలకు చెందిన ప్రైవేట్ భూమిని ఇదే పట్టణానికి చెందిన రామాంజినేయులు, వెంకటేషులు, పార్వతమ్మలు అక్రమంగా కొనుగోల చేశారు. దౌర్జన్యంగా ఇనుప పట్టేసుకొని ఆక్రమించుకొని ఉన్నారని ఆరోపించారు. భూమి హక్కు దారులు ఆక్రమణదారుల పెట్టను తొలగించాలని సంబంధిత పోలీసు, రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్న స్పందించ లేదని విమర్శించారు. గత్యంతరం లేక కుటుంబ సభ్యులతో కలిసి ఆక్రమణదారుల ఇనుప పెట్టెను భూమి నుంచి తొలగించి భూమిని కాపాడుకునే ప్రయత్నం చేశారన్నారు. ఆక్రమణదారులు భూమి హక్కు దారులపై దౌర్జన్యానికి దిగారు అన్నారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాల వాదనలు విన్నామన్నారు. వాస్తవ విషయాలను పరిశీలించి ఇరువురి మధ్య భూ వివాదానికి కారణమైన అధికారుల నిరక్షాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ వివాదం తీవ్ర రూపం దాల్చకుండా అధికారులు జోక్యం చేసుకుని నిజమైన హక్కు దారులకు భూమి అప్పగించి, వారి కుటుంబానికి రక్షణ కల్పించాలని, అక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. భూమి హక్కు దారులకు న్యాయం జరిగేవరకు కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాలు అండగా నిలబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భూమి హక్కుదారుల ముక్రం, ముసరత్, అబ్బాస్, ఫర్దిన్, రీమాస్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణ, హనుమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జ్యోతమ్మ, వెంకటేషులు, నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, వెంకటరాముడు, కెవి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ సోమందేపల్లి సిఐటియు నాయకులు కొండా వెంకటేషులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, పోమందేపల్లి చేనేత మండల నాయకులు శీలా నారాయణస్వామి, స్థానిక సిఐటియు నాయకులు బాబావలి, చిన్న వెంకటేషులు, వజ్రం నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన అంతరాష్ట్ర కోఆర్డినేటర్

**అగళి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** కర్ణాటక డిప్యూటీ పోలీస్ కమిషనర్ రెవిడిచన్నను ఐపిఎస్ క్యాడర్ అధికారిని అంతరాష్ట్ర వాల్మీకి సంఘం కోఆర్డినేటర్ మంజునాథ్ మార్యద పూర్వకంగా కలిశారు. మంచి పోలీస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ, నిజాయితీకి మారుపేరైన చన్నను కలవడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రరాష్ట్రంలో బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించడం కోసం దీర్ఘకాలికంగా పోరాటాలు జరుపుతున్నామని, కానీ అది ఆచరణలోకి రాలేదని, మీరు సహాయ సహకారాలు అందించాలని కోరగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని కమిషనర్ చెప్పడంతో వీరు హర్షం వ్యక్తం చేశారు.


మర్యాద పూర్వకంగా కలిసిన దృశ్యం

## మడకశిర తేదేపా టికెట్ యువతకు వరించేనా..?

### - ఆశగా ఎదురు చూస్తున్న యువకులు

**గుడిబండ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులునారా చంద్రబాబునాయుడు ఈ నెల 40 నుంచి సీట్లను యువతకు కేటాయిస్తామని చెప్పడంతో మాజీ ఎమ్మెల్యే ఈరన్నతోపాటు చాలా మంది ఉత్సావంతులైన యువకులు మడకశిర తెలుగుదేశం పార్టీ ఎంఎల్‌ఏ అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు. ఇప్పటి వరకు దాదాపు పది మంది దాకా తమ తమ బయోడేటాలను అధిష్టానానికి సమర్పించినట్లు సమాచారం. అలాగే లోకేష్‌బాబు చేపట్టిన యువగళం పాదయాత్రలో కొందరు యువకులు లోకేష్‌ను కలిసి మడకశిర ఎమ్మెల్యే టికెట్ యువతకు కేటాయించాలని కోరినట్లు దానికి లోకేష్ కూడా సానుకూలంగా స్పందించినట్లు నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రధానంగా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి నాయకత్వంలో స్థానిక సమస్యలపై పోరాడుతూ వైకాపా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, స్థానిక ఎమ్మెల్యే అవినీతిని ప్రశ్నిస్తూ దూకుడు ప్రదర్శిస్తున్నాడు. మడకశిర నియోజకవర్గంలో ఆశావహులు పెరగడంతో తెలుగుదేశం పార్టీ అధిష్టానం కూడా రహస్య సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం. మరి మడకశిర తేదేపా టికెట్ యువతకు వరిస్తుందో లేదో తెలియాలంటే మరి కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## ఆర్మీ జవాను సమరసింహారెడ్డిపై దాడి అమానుషం

### - జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్


జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్

**గుడిబండ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ఆర్మీ జవాన్ సమరసింహారెడ్డిపై దాడికి పాల్పడిన అనంతపురం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డితోపాటు అతని అనుచరులను వెంటనే అరెస్టు చెయ్యాలని శ్రీ సత్యసాయి జిల్లా తేదేపా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మవరంనియోజకర్గంతుమ్మల గ్రామంలో పోతులయ్యస్వామి గావుల మహోత్సవానికి పరిటాల శ్రీరామ్‌ను ఆర్మీ జవాను సమరసింహారెడ్డి ఇంటికి ఆహ్వానించారనే కక్షతో దేశరక్షణకు ప్రాణాలర్పించే ఆర్మీజవాను పైనే వైసీపీనాయకులు దౌర్జన్య కాండ సాగించారని కావున వైసీపీ రౌడీలను వెంటనే అరెస్టు చేయాలని లేని పక్షంలో జిల్లా ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## బిజెపిలో దొమ్మరాట ఆడించింది మేమే

### - బిజెపి అభ్యర్థి కృష్ణానాయక్

**పావగడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** పావగడ నియోజకవర్గంలో మే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలలో పార్టీకి ప్రజాదరణ పెరిగేందుకు మాజీ ఎంపి జనార్ధస్వామిని పిలిపించి దొమ్మరాట ఆడించింది మేమేనని పావగడ బిజెపి అభ్యర్థి కృష్ణానాయక్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి బిజెపి అభ్యర్థిగా కృష్ణ అనే పేరు ప్రకటించిన తర్వాత బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణనాయక్ పాల్గొని మాట్లాడారు. పార్టీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్న సమయంలో పోటీ ఉందని నిరూపించి ప్రజలలో పార్టీ ఇమేజ్‌ను పెంచడానికి మాజీ ఎంపి జనార్ధన స్వామిని పిలిపించి దొమ్మరాట ఆడించామని పార్టీలో గ్రూపులు లేవని పేర్కొన్నారు. పార్టీలోని నాయకులకు కార్యకర్తలకు అప్పగించిన బాధ్యతలను ఎవరికి వారు సక్రమంగా నిర్వహించి పార్టీ విజయానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గం నుంచి వసలు వెళ్లి వారిని నివారంచి ఉద్యోగ భృతి కల్పిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు మూలభూత సౌకర్యాలను కల్పిస్తామని తాలూకా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ఇంత వరకు జెడిఎస్, కాంగ్రెస్ పారీటలను గెలిపించారని తాలూకా అభివృద్ధి శూన్యమని విమర్శించారు. బిజెపికి ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.

## వై.రాంపురంలో వ్యవసాయ బావిలోపడి వ్యక్తి దుర్మరణం

### -మృతదేహానికి ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం


వ్యవసాయ బావిలోపడి మృతి చెందిన కురుబ హనుమంతు

**ఉరవకొండ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వై.రాంపురం గ్రామంలోని వ్యవసాయ బావిలోపడి బెలుగుప్ప మండలం తగ్గుపర్తి గ్రామానికి చెందిన కురుబ హనుమంతు (58) దుర్మరణం పాలయ్యాడు. ఉరవకొండ సీఐ వి.హరినాథ్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే.. హనుమంతు వై.రాంపురం గ్రామంలోని బంధువులకు తమ ఊళ్లో నిర్వహిస్తున్న దేవరకు ఆహ్వానించడానికి రెండు రోజుల క్రితం గ్రామానికి వచ్చాడన్నారు. ఈక్రమంలో అతను మంగళవారం ఇంటి నుంచి బయటకెళ్లిన ఆయన మద్యం మత్తులో కాలుజారి బావిలోపడి మునిగిపోయాడన్నారు. బుధవారం ఉదయం బావిలో మృతదేహం తేలియడగా గ్రామస్థుల ద్వారా సమాచారం తెలుసుకొని మృతదేహాన్ని బయటకు తీయించామన్నారు. మృతుని భార్య తిమ్మక్క పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. మృతునికి భార్యతోపాటు కొడుకు, కుమార్తె ఉన్నారన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డిని సన్మానించిన చంద్రశేఖర్


కిరణ్ కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న చంద్రశేఖర్

**మడకశిర ఏప్రిల్ 12 ప్రభాతవార్త;** బిజేపి రాష్ట్ర కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ ఎస్.చంద్రశేఖర్ విజయవాడ బిజేపి కార్యాలయంలో ఇటీవల బిజేపిలో చేరిన మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని బుధవారం ఘనంగా సన్మానించారు. బిజేపిలో చేరిన తర్వాత మొదటిసారి విజయవాడ పార్టీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ఆయన్ను సన్మానించి మడకశిర పర్యటనకు రావాలని విన్నవించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి బిజేపి బలోపేతానికి కృషి చేస్తానని రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో పార్టీ ఆదేశానుసారంగా పర్యటిస్తానని ఆయన అన్నారని చంద్రశేఖర్ తెలియజేశారు.

## పుట్టపర్తిని టెంపుల్ జోన్‌గా ప్రకటించాలి

**పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** ప్రముఖ ఆధ్యాత్మికకేంద్రమైన పుట్టపర్తిని టెంపుల్ జోన్‌గా ప్రకటించాలని సాయి యూత్‌డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతికి, కమీషనర్ వెంకటరామిరెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సాయి యూత్ నాయకులు మాట్లాడుతూ, ఇటీవల ఎప్పుడూ జరగని విధంగా రాజకీయ పార్టీల దాడులు చేసుకున్నాయని గుర్తు చేశారు. దేశవిదేశాల నుండి వచ్చే భక్తులు పర్యాటకులకు మనస్థాపం కలిగేలా దాడులు చేసుకున్నారని, సత్యసాయి జన్మించిన ఈ ప్రదేశంలో రాజకీయ సభలు, ధర్నాలు, ఆందోళనలు, చేపట్టకుండా హనుమాన్ టెంపుల్ నుండి విద్యాగిరి వరకు నిషేధం విధిస్తూ టెంపుల్ జోన్‌గా ప్రకటించాలని, అందుకు మున్సిపాలిటీలో తీర్మాణం చేసి, ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బయనన, లక్ష్మిపతి, సామకోటి ఆదినారాయణ, డాక్టర్ తిరుపతేంద్ర, అబ్దుల్, జ్యోతి ప్రసాద్, కత్తిరాజారెడ్డి, బేకరీ నాయుడు, రాము తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం కల సాకారమౌతోంది..!

### -మోపిడిలో నూతన సచివాలయం ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


నూతన సచివాలయాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కల సాకారమౌతోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మోపిడి గ్రామంలో 40 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఆయన బుధవారం ఉదయం గ్రామ సర్పంచ్ సిద్దప్పతో కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజలకు వారి గ్రామంలోనే 500 పైచీలకు సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గతంలో ఏ చిన్న పనికోసమైనా ప్రజలు వ్యయ ప్రయాసలకు ఓర్చి మండల కేంద్రానికి రావాల్సి వచ్చేదన్నారు. నేడు గ్రామంలోనే పారదర్శకంగా అన్ని రకాల సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయాలు నేడు ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, ఆమిద్యాల పీఏసీఎస్ ఛైర్మెన్ బి.తేజోనాథ్, పెన్నహోబిళం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్, కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ కె.గోవిందు, వైసీపీ నాయకులు ఆమిద్యాల రాజేష్, ఆంజనేయులు, సుధాకర్, రామకృష్ణ, నాగరాజు, లాలెప్ప, ఆనంద్, భారతి, ప్రసాద్, మారెప్ప, పెద్దన్న, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## నేత్రదానం చేసిన దివ్యాంగ బాలుడు..!

### -తాను చనిపోతూ మరో ఇద్దరికి చూపును ప్రసాదిస్తున్న వైనం


నేత్రదానం చేసిన దివ్యాంగుడు సాయిబాలాజీ (ఫైల్‌ఫోటో)

**ఉరవకొండ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామానికి చెందిన భీమయాదవ్ (ఉరవకొండకు చెందిన ఆపద్బాంధవ ట్రస్టు సభ్యుడు) అనే వక్తి కుమారుడైన పదమూడేళ్ళ దివ్యాంగుడు సాయిబాలాజీ నేత్రదానం చేసి తాను చనిపోతూ మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదిస్తున్నాడు. రెండు కాళ్లకు పోలియోతోపాటు సరిగ్గా మాట్లాడలేని స్థితిలోవున్న అతను గత రెండు రోజులుగా అనారోగ్యానికి గురై బుధవారం ఉదయం 7 గంటల సమయంలో తుదిశ్వాస విడిచాడు. అతను చనిపోతూ తన తదనానంతరం తన కళ్లను దానం చేయాలని కుటుంబ సభ్యులను కోరివుండటంతో వారు మానవత సంస్థ అధినేత తరిమెల అమర్నాథ్‌రెడ్డి ద్వారా సాయి ట్రస్టును సంప్రదించి వారి ద్వారా ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి నేత్రదానం చేశారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అభ్యర్థన మేరకు ఆర్డీటీ సంస్థ కళ్లను సేకరించడానికి ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయగా ఉదయం గ్రామంలోని మృతుని ఇంటికి చేరుకున్న విజయసాయికుమార్, ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆప్తమాలజి అసిస్టెంట్ శ్రీకాంత్ మృతి చెందిన దివ్యాంగ బాలుడి నుండి కళ్లను సేకరించి జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన దివ్యాంగ బాలుడు సాయి బాలాజీ కుటుంబ సభ్యులకు, ఇందుకు సహకరించిన తరిమెల అమర్నాథ్‌రెడ్డికు, ఆర్డీటీ సంస్థకు సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, ఆపద్బాంధవ ట్రస్టు అధ్యక్షుడు వేల్పుల మురళి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాయి ట్రస్టు సభ్యులు నారాయణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని పాద యాత్ర

**అమరాపురం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఇరుప సముద్రం గ్రామ నుంచి అమరాపురం వరకు తారురోడ్డు నిర్మాణం కోసం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ పాద యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ గణేష్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గౌడనకుంట జయరామ్ లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి శ్రీనివాసమూర్తిలు హాజరవుతున్న ఆయన పేర్కొన్నారు. 14వ తేదీ ఉదయం 7.30 గంటలకు ఇరుపు సముద్రం గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా గత ఏడాదిన్నర క్రితం తారురోడ్డు నిర్మాణానికి రూ. 8 కోట్లు నిధులు మంజూరు చేసిందని అయితే ఉన్న రోడ్డును తీసివేసి కంకరవేసారే తప్పా రోడ్డు పూర్తి చేయడం మరిచారు. దీంతో వాహనాదారులు ప్రజలు ప్రమాదాలకుగురై ఆసుపత్రి పాలవుతున్నారు. తెలుగుదేశం పార్టీఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పాదయా త్రకు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మాజీ ప్రజా ప్రతినిధులు టిఎన్ఎస్ఎఫ్ తెలుగు యువత, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సెల్ నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ముస్లిం సోదరులకు డిఎస్పీ ఇఫ్తార్ విందు భోజనాలు ఏర్పాటు


భోజనాలు వడ్డిస్తున్న డిఎస్పీ మహబూబ్‌బాషా

**రొద్దం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** మండల పోలీసు స్టేషన్ ఆవరణంలో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ఉపవాసాలు ఉన్న ముస్లిం సోదరులకు డిఎస్పీ మహబూబ్ బాషా ఇస్తార్ ఇందు భోజనాలు ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. డిఎస్పీ మహబూబ్‌బాషా ప్రతి ఏడాది రంజాన్ మాసంలో ఉప వాస దీక్షలు చేపడుతున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు భోజనాలు ఏరా ్పటు చేస్తూ సేవా భావం చాటుతున్నారు. ఈ సందర్భంగా భోజనాలను ఎస్ఐ నాగస్వామి, డిఎస్పీ మహబూబ్‌బాషా లు పోలీసు సిబ్బందితో కలిసి ముస్లిం సోదరులకు భోజనాలు వడ్డించి ఆలింగనం చేసుకున్నారు.

## జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పనులు కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపిడిఓ లక్ష్మినారాయణ, ఏపిడి వెంకటా చలపతి

**కనగానపల్లి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ధర్మవరం క్లస్టర్ ఏపి డి.వెంకటా చలపతి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఓ లక్ష్మినారాయణ అధ్యఓతన ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపిడి వెంకటాచలపతి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఒక్కరికి పనులను కల్పించే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యత తీసుకోవాలని లేకుంటే గ్రామాల్లో పనులు కల్పించుకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ సుధాకర్, ఈసి సాయి టెక్నికల్ అసిస్టెంట్లు, సిఓలు సత్యమయ్య, వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు వీరనారాయణస్వామి, మహేష్‌రెడ్డి, ఎరిస్వామి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## ఉన్న విషయాలు మాట్లాడితే ఉలికిపాటు ఎందుకు

### -వైకాపా నాయకుల భూకబ్జాలు ప్రజలకు తెలుసు

### -సిపిఐ రాష్ట్ర నాయకులపై చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

**గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** ఉన్న విషయాలు మాట్లాడితే వైసిపి నాయకులకు ఉలికిపాటు ఎందుకని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు గోవిందు ప్రశ్నించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక వైకాపా నాయకుల భూకబ్జాలు ప్రజలకు తెలుసన్నారు. దోనిముక్కల ప్రాంతంలో భూకబ్జాలకు పాల్పడుతూ ఒక్కొక్క ప్లాట్ 2 నుండి 3 లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఒకప్పుడు సైకిల్ కూడా లేనివారు ఇప్పుడు ఇన్నోవా కారులో తిరుగుతున్నారన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులపై మాజీ మున్సిపల్‌చైర్మన్లు చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలన్నారు. తమ పార్టీ ఏ పార్టీకి తొత్తు కాదని ఎవరి పక్షాన మాట్లాడాల్సిన అవసరం తమకు లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బడుగు, బలహీనవర్గాల ప్రజల పక్షాన సిపిఐ నిలబడుతుందన్నారు. వైకాపా ఎమ్మెల్యేలపై ప్రజల్లో వున్న అభిప్రాయాలను మా నాయకులు చెప్పడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం, మట్టి మాఫీగా జరుగుతున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వైసిపి నాయకులు లంచాలు అడుగుతుండడం వల్లే పరిశ్రమలు రాష్ట్రానికి రావడంలేదన్నారు. అమర్‌రాజా, జాకీ, తదితర పరిశ్రమలే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. వైసిపి అరాచకాలను సిపిఐ ఖండిస్తూనే వుంటుందన్నారు. అనంతరం నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ నవరత్నాలు తప్పా రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం వుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి గోపినాథ్, మండల కార్యదర్శి రాముురాయల్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, నాయకులు రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

## పనిభారం తగ్గించాలని రైల్వే కార్మికుల ధర్నా


రైల్వే కార్మికులు నిరసతెలుపుతున్న దృశ్యం

**గుత్తి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో కార్మికులకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డీజిల్‌షెడ్‌లో ఇదివరకే 226 ఇంజన్లు వుండగా అదనంగా మరో 20 ఎలక్ట్రికల్ లోకోలను కేటాయించారన్నారు. కేవలం 150 ఇంజన్ల నిర్వహణకు మాత్రమే సిబ్బంది వుండగా ఇప్పటికే పనిభారం పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం అధికారుల చర్యల వల్ల పనివత్తిడి అధికమైందన్నారు. సంబంధించిన మెటీరియల్, పనిముట్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ డిఎంఇ రమేష్ కార్మికులతో మాట్లాడుతూ జి4 లోకోలను బదిలీ చేస్తామని అవసరమైన మేరకు పనిముట్లు సరఫరా చేస్తామని హామి ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నారాయణ, రామాంజినేయరెడ్డి, ఖలందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎఎస్ఐ లూకయ్య మృతికి ఘన నివాళులు


ఎఎస్ఐ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**గుత్తి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త :** గుత్తి అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా మృతి చెందిన లూకయ్యకు ప్రజా సంఘాలు బుధవారం ఘనంగా నివాళులు అర్పించాయి. స్థానిక గాంధీచౌక్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజలందరితో సుపరిచితులుగా వుంటూ ట్రాఫిక్‌లో అందరిని పలకరిస్తూ వుండే లూకయ్య మృతి తీరనిలోటని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు అంజనప్రసాద్, సిపిఐ కార్యదర్శి రామదాసు, కమ్మసంక్షేమ సంఘం అధ్యక్షులు బోర్‌వెల్ నాగరాజు, తెలుగుయువత మండల కన్వీనర్ సుధాకర్‌నాయుడు, ఆటో యూనియన్ నాయకులు నాగార్జున, అంజి, హనుమయ్య, షఫి, కిషోర్, ధనుంజయాచారి, రామాంజి, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## హుండీ మొత్తాన్ని ఆర్‌డిటి సంస్థకు అందజేత


ఆర్‌డిటి సిఓకు చెక్‌ను అందిస్తున్న గ్రంథాలయ అధికారి జయరాం

**కొత్తచెరువు, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** మండల కేంద్రమైనకొత్త చెరువులోని శాఖ గ్రంథాలయం నందు ఏర్పాటు చేసిన స్పందించు... సాయమందించు.... హుండీలో జమ అయిన మొత్తాని గ్రంథాలయ అధికారి జయరాం, పాఠకులతో కలసి హుండీ మొత్తాన్ని లెక్కజేసి ఆర్.డి.టి సంస్థ సిఓ గంగాధర్‌కు చెక్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జయరాం మాట్లాడుతూ, పాఠకులు ఈ హుండీలో తమకు తోచిన మొత్తాన్ని వేసి ఎంతో మంది ఆదరణ లేని పిల్లల చదువులు, పౌష్టికాహారలోపంతో బాధపడుతున్న అభాగ్యులకు ఆపన్న హస్తం అందిస్తున్న ఆర్‌డిటి సంస్థలకు చేయూతను అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు సురేసబాబు, హరినాథ్ చౌదరి, మహమ్మద్, కిష్టప పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య పరీక్షలు

**పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**

పుట్టపర్తి పట్టణ, మండల పరిధిలో ఇండియా రెడ్‌క్రాస్ సొసైటీ, ఎల్వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వారు సంయుక్తంగా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మంగళకర ఎడ్యుకేషన్ చిల్డ్రన్స్ హోమ్ బాయ్స్ అండ్ గర్ల్స్‌నందు 16 మందికి, ఏయిర్‌పోర్టు రోడ్‌లోని హ్యాపీ హోం ట్రస్ట్‌లో 09 మందికి, కర్ణాటకనాగేపల్లిలోని హోలిసిటీ మినిస్ట్రీ హోం నందు ఒకరికి, ప్రేమ ధర్మఛారిటబుల్ ట్రస్ట్‌లో ఇద్దరికి, బత్తలపల్లిలోని ఆర్‌డిటి మనో వికాస కేంద్రం 7 మందికి, మెదడు పక్షపాత కేంద్రంలో ముగ్గరికి, హెచ్ఐవి బాధిత చిల్డ్రన్స్‌కు 4గురికి చొప్పున మొత్తం 42 మందికి ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మంగళకర ఎడ్యుకేషనల్ ట్రస్టీ ఆర్యప్రకాష్, ప్రిన్సిపాల్ బిందూజ, హ్యాహోం ట్రస్ట్ రంజిత, రెడ్ క్రాస్‌కో ఆర్డినేటర్ బి.రమేష్, ఎల్.వి.ప్రసాద్ కో ఆర్డినేటర్ రఫీక్, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ బత్తలపల్లి సెంటర్స్ ఇన్‌చార్జులు సిస్టర్స్ ఆగ్నేస్, క్యాథరిన్, సబితా, విద్యార్థులు పాల్గొన్నారు.

